

కూటమి నేతలకు 'ఉపాధి' మేత

ఉపాధిహామీ పథకం పనులను అధికారులు కూటమి నేతల ఒత్తిళ్ల మేరకు యంత్రాలతో చేసి పేదల పొట్ట కొడుతున్నారు. - 8లో



బోయకొండలో భక్తుల రద్దీ

పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. - 8లో



జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

ఐరాల హైస్కూల్‌లో జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ సీనియర్, జూనియర్ బాల, బాలికల ఎంపిక పోటీలు జరిగాయి. - 8లో

న్యూస్‌రీల్

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటాం



లేఅవుట్ వద్ద బ్యానర్ ఏర్పాటు చేయిస్తున్న వైస్ చైర్మన్ బాబర్

పెద్దపంజాణి: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా లేఅవుట్లు వేస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని పీకేఎం ఉడా వైస్ చైర్మన్ బాబర్ తెలిపారు. సోమవారం ఆయన తన సిబ్బందితో కలసి పలు లేఅవుట్లను తనిఖీ చేస్తూ మండలంలోని కోగిలేరు పంచాయతీ పరిధిలో నూతనంగా వేస్తున్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో, పీకేఎం ఉడా నుంచి లేఅవుట్‌కు తప్పకుండా అనుమతి తీసుకోవాలని సంబంధిత యాజమాన్యానికి సూచించామని, వారు త్వరలోనే అనుమతి తీసుకుంటామని తెలిపారన్నారు. అదేవిధంగా అక్రమ లేఅవుట్లను ఎవరూ ఏర్పాటు చేయరాదని, అలా చేస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీకేఎం ఉడా అనుమతి పొందే వరకు ఎవరూ ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయరాదన్నారు. లేఅవుట్ యాజమాన్యం పీకేఎం ఉడా నుంచి అనుమతులు పొందే వరకూ ఇళ్ల స్థలాలకు సంబంధించి క్రయ, విక్రయాలు చేయరాదని అలా చేస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్‌బాబు, సచివాలయ, పీకేఎం ఉడా సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం



నియామక పత్రాలు అందుకుంటున్న సభ్యులు

కాణిపాకం: చిత్తూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ నియమించారు. జిల్లా అధ్యక్షుడిగా చల్లూరు ద్వారకనాథ్, జనరల్ సెక్రటరీగా తిరువీధి రవీంద్రబాబు, అడిషనల్ జనరల్ సెక్రటరీగా చిలుంకూరు వెంకటేష్, కోశాధికారిగా ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా రామ్మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కర్నూలులోని మాజీమంత్రి టీజీ వెంకటేష్‌ను కలిసి వీరు నియామకపత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో నరసింహులు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, బాలిక మిస్సింగ్, వేధింపులు, ఇంటి తగాదాలు, ఆర్థిక లావాదేవీలు, సివిల్ గొడవలు, మహిళ మిస్సింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో అధికారులు విచారించి, తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ఏఆర్ కార్యాలయంలో ఏఎస్పీ ఆరీఫుల్లా, మహిళా స్టేషన్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తదితరులు సైతం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

సర్కారు స్కూళ్లలో శిక్షా సప్తాహ్



చిత్తూరు రూరల్‌లోని తుమ్మింద పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో పాల్గొన్న టీచర్లు, విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సర్కారు స్కూళ్లలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. జాతీయ విద్యావిధానం-2020 అమలులోకి వచ్చి నాలుగో సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన, అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని డీవైఈఓ, ఎంఈఓలు పర్యవేక్షించారు.

కుప్పంలో అలా.. తిరుపతిలో ఇలా!



కూటమి నేతల ఆగడాలకు అంతేలేకుండా పోతోంది. వైఎస్సార్‌సీపీ ఆధీనంలో ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లను కూటమి నేతలు కైవసం చేసుకునేందుకు బెదిరింపులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఎక్కడా వైఎస్సార్‌సీపీ పేరు వినిపించకుండా ఉండేందుకు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తున్నారు. 'మర్యాదగా పచ్చ కండువా కప్పుకోండి. లేదంటే మీ అంతు చూస్తాం. పాతకేసులు ఏవైనా ఉంటే తోడుతాం. లేవంటే ఏదో ఒక కేసు పెట్టి జైలుకు పంపుతాం' అంటూ పోలీసులు, ఇంటలిజెన్స్ అధికారుల ద్వారా కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆ కోవలోనే చిత్తూరు కార్పొరేషన్‌తో పాటు పుంగనూరు మున్సిపాలిటీని కూటమి నేతలు దౌర్జన్యంగా వారి ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఇంకా మిగిలిన వాటిపై దృష్టి సారించారు.

- కార్పొరేషన్, మున్సిపాలిటీలే లక్ష్యంగా కూటమి కుట్రలు
- తిరుపతి మేయర్ పీఠం కోసం టీడీపీ, జనసేన పోటాపోటీ
- కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు బెదిరింపులు
- పార్టీ మారాలంటూ ఒత్తిళ్లు
- కుప్పం మున్సిపల్ కౌన్సిలర్లకు ఓ పోలీసు, ఇంటలిజెన్స్ అధికారి వార్నింగ్
- తిరుపతిలో జనసేన జీరో.. తామే హీరోలంటూ టీడీపీ నేతల ప్రస్తావన
- చిత్తూరు, పుంగనూరు తరహాలో కార్పొరేషన్, మున్సిపాలిటీ కోసం బరితెగింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లా పరిషత్‌తో పాటు.. తిరుపతి, చిత్తూరు కార్పొరేషన్లు, కుప్పం, పుంగనూరు, పలమనేరు, నగరి, పుత్తూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు మున్సిపాలిటీలన్నింటిలోనూ వైఎస్సార్‌సీపీ నేతలే విజయం సాధించారు. మేయర్, మున్సిపల్ చైర్మన్ పీఠాలను కైవశం చేసుకున్నారు. అదేవిధంగా అన్ని మండల పరిషత్‌ల్లోనూ వైఎస్సార్‌సీపీ నేతలే ఎంపీపీలుగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతలు తమ అనుచరులను ఆ కుర్చీల్లో కూర్చోబెట్టేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు.



రంగంలోకి ఖాకీలు

ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు కొందరు టీడీపీ, జనసేన నాయకుల్లా వ్యవహరిస్తున్నారు. కార్పొరేషన్, ఎంపీపీ, జెడ్పీటీసీ కుర్చీల్లో కూటమి నేతలను కూర్చోబెట్టేందుకు వైఎస్సార్‌సీపీ తరుపున గెలిచిన వారిని ప్రత్యేకంగా పిలిపించి బెదిరింపులకు పాల్పడుతున్నారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను పిలిపించి టీడీపీలో చేరాలంటూ బెదిరింపులకు దిగారు. ఓ పోలీసు, ఇంటిలిజెన్స్‌లోని మరో అధికారి నేరుగా వారి నివాసాలకు, మున్సిపల్ కార్యాలయానికి పిలిపించి బెదిరించిన విషయం తెల్సిందే. వైఎస్సార్‌సీపీ తరుపున గెలిచిన మున్సిపల్ కౌన్సిలర్లందరినీ చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి పచ్చకండువాలు కప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అదేవిధంగా కుప్పం నియోజకవర్గం గుడుపల్లి మండల పరిధిలోని ఎంపీటీసీ, సర్పంచ్‌లను సైతం ఇదే స్థాయిలో పోలీసుల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారు. కొద్ది రోజుల్లో నియోజకవర్గంలో ఉన్న కౌన్సిలర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లందరినీ అమరావతికి తీసుకెళ్లి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేర్చేటట్లు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది.

జనసేన జీరో అంట

తిరుపతిలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యే అయినా.. తిరుపతిలో జనసేన జీరో.. తామే హీరోలమంటూ టీడీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో తిరుపతి మేయర్ పీఠంపై టీడీపీ, జనసేన పార్టీ కార్పొరేటర్లను కూర్చోబెట్టాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవంగా అయితే తిరుపతిలోని 50 డివిజన్‌లలో 49 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ నేతలే విజయం సాధించారు. కేవలం ఒకే ఒక స్థానంలో టీడీపీ అభ్యర్థి కార్పొరేటర్‌గా గెలుపొందారు. ఎన్నికలకు నాలుగు రోజుల ముందు, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కొంత మంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు డబ్బులిచ్చి కూటమి ప్రభుత్వంలో చేర్చుకున్నారు. వారిలో ఒకరిని మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలని ఇటు టీడీపీ, అటు జనసేన నేతలు తహతహలాడుతున్నారు. అందులో భాగంగా ఆదివారం కొందరు కార్పొరేటర్లతో ఆయా పార్టీలకు చెందిన నాయకులు రహస్య సమావేశాలు నిర్వహించారు. కొంతమందిని బెదిరించారు. అలాగే ఇంకొంత మందికి ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారు. తిరుపతిలో జనసేన జీరో అని, టీడీపీ నేతలే హీరోలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో అన్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే.. తాము అడిగినంత డబ్బు ఇచ్చి, పార్టీ మారితే మేయర్, చైర్మన్ కుర్చీలో మీరే కొనసాగవచ్చంటూ ఆఫర్ చెస్తున్నట్టు తెలుస్తుంది. ఈ సందర్భంగా కొందరు ప్రాణం ఉన్నంత వరకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లగానే ఉంటామని, పార్టీ మారే ఆలోచనే లేదని తేల్చిచెప్పడం విశేషం.

కక్ష పూరితంగానే మండలమీట్ అడ్డుకున్నారు



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌బాబు

పూతలపట్టు: యాదమరి మండల సర్వసభ్య సమావేశాన్ని టీడీపీ నాయకులు కక్ష పూరితంగానే అడ్డుకున్నారని ఎంపీపీ సురేష్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి జెడ్పీ వైస్‌చైర్మన్ ధనుంజయరెడ్డి, తాను వస్తుండగా కార్యాలయం ఎదుట టీడీపీ నేతలు కారును అడ్డగించడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ఇలాంటి దౌర్జన్యాలు చేయలేదని, పార్టీలకు అతీతంగా పని చేశామన్నారు. గత ప్రభుత్వంలో అన్ని సమావేశాలకు టీడీపీ వాళ్లను స్వాగతించామని, అయితే ఇప్పుడు వారు అధికారమదంతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. మండల మీట్‌ను కక్ష పూరితంగానే అడ్డుకున్నారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అధికారం ఇచ్చింది మంచి చేయడానికి కానీ, అరాచకాలు చేయడానికి కాదన్నారు.

25న బీటెక్ డ్యూయల్ డిగ్రీకి కౌన్సెలింగ్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ, స్వీడన్‌కు చెందిన బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించే బీటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు ఈనెల 25న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. బీటెక్ డ్యూయల్ డిగ్రీలో చేరే విద్యార్థులు మూడేళ్ల పాటు మహిళా వర్సిటీలో కోర్సు చదవాల్సి ఉంటుందని, మరో ఏడాది పాటు స్వీడన్‌లోని బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యనభ్యసించాల్సి ఉంటుందన్నారు. ఇంటర్‌లో 70 శాతం మార్కులు సాధించి, ఏపీ ఈఏఎమ్ సెట్-2024లో అర్హత సాధించిన మహిళా అభ్యర్థులు ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు గురువారం వర్సిటీలోని సావేరి సెమినార్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు మహిళా వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను కానీ, 79959 73878 నంబరులో సంప్రదించాలని కోరారు.

కనుల పండువగా శ్రీవారికి పుష్పయాగం



శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

- 18 రకాల పుష్పాలతో నివేదన
- అప్పలాయగుంటకు పోటెత్తిన భక్తులు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామికి సోమవారం పుష్పయాగం కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లోగానీ, నిత్యకైంకర్యాల్లో గానీ, అర్చక పరిచారకుల వల్ల లేక అధికారులు, భక్తుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటి నివృత్తి కోసం పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం 5.45 గంటలకు సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తోమాలసేవ, కొలువు, అర్చనలు చేశారు. 11 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు పుష్పయాగం కోసం వినియోగించే పుష్పాలను మూలవిరాట్టు వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆ పుష్పాలతో మాడ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. 2.40 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వేదమంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీవారి పుష్పయాగాన్ని కనుల పండవగా నిర్వహించారు. తులసి, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు తదితర 18 రకాల పుష్పాలు, ఆరు రకాల పత్రాలతో పుష్పయాగం కనుల పండువగా సాగింది. తదుపరి విశేష నివేదన, అర్చకుల బహుమాన కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు తిరువీధి ఉత్సవం, రాత్రి 8.30 గంటలకు ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, కంకణభట్టార్ సూర్యకుమారాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.



పుష్పాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో రెండేళ్ల కాల వ్యవధి గల పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్ కౌన్సిల్ పరిధిలో పారా మెడికల్ కోర్సుల్లో 2024-25 అకడమిక్ ఇయర్‌కు సీట్లు భర్తీ చేస్తున్నట్టు వెల్లడించారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ -30 సీట్లు, డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్- 30 సీట్లు అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీపీఎంబీ.కో.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి ఆగస్టు 6వ తేదీ సాయంత్రంలోపు ఎస్వీ మెడికల్ కళాశాల పారామెడికల్ విభాగంలో రూ.100 చెల్లించి అందజేయాలని కోరారు. వివరాలకు 944087 9943లో సంప్రదించాలని సూచించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నిబంధనల మేరకు మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుందని పేర్కొన్నారు.

ఇసుక లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించండి

- సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇసుక లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుక లభ్యమయ్యే ప్రాంతాలు, పరిమాణాన్ని నివేదిక రూపంలో జిల్లా ఇసుక కమిటీకి అందజేయాలన్నారు. జూలై 8న నూతన ఇసుక విధానంలో భాగంగా అమల్లోకి వచ్చిన జీఓ 43ని క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో మూడు స్టాక్ యార్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిత్తూరు రూరల్ మండలంలోని దిగువమాసాపల్లిలో 42027 ఎంటీఎస్, పాలూరులో 139211 ఎంటీఎస్, గంగవరం మండలంలోని బైరెడ్డిపల్లి స్టాక్‌యార్డ్‌లో 3280 ఎంటీఎస్ ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏర్పాటైన జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, పక్క రాష్ట్రాలకు తరలించకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ చిన్నయ్య, మైన్స్ డీడీ ప్రసాద్, భూగర్భగనుల శాఖ అధికారి గోవర్ధన్‌రెడ్డి, డీపీఓ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అంశాల నివేదికలు అందజేయండి

క్షేత్రస్థాయిలో ఆర్థిక పరమైన అంశాల నివేదికలను అధికారులు అందజేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటనలో అందిన అర్జీలను కచ్చితంగా పరిష్కరించాలన్నారు. అర్జీలలో ఆర్థిక పరమైన అంశాలు ఉన్నట్లు అయితే తెలియజేయాలన్నారు. సీఎం పర్యటనలో అందిన అర్జీల్లో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 35 కాగా, అందులో బీటీ, సీసీ రోడ్లు, ఆలయాల నిర్మాణాలకు సంబంధించినవి ఎక్కువ వచ్చినట్లు తెలిపారు. సర్వే శాఖకు సంబంధించి 7 అర్జీలు, పశుసంవర్ధక శాఖకు 6 అర్జీలు అందగా మూడు సర్వీస్ మోటార్లు కావాలని కోరారన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



డీఆర్‌ఓ పుల్లయ్యకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను సత్వరం పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు సోమవారం డీఆర్‌ఓ పుల్లయ్య, డీఈఓ దేవరాజులను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. జీఓ నంబర్ 117ను రద్దు చేసి జీఓ 55 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం అమలు చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్ మాట్లాడుతూ హైస్కూళ్లలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. హైస్కూళ్లలో నాన్‌టీచింగ్ సిబ్బందిని కేటాయించాలని, మున్సిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ప్లస్ టు స్కూళ్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.సుధాకర్ రెడ్డి, జిల్లా సహాధ్యక్షురాలు ఎస్.రెహానా బేగం, జిల్లా కార్యదర్శులు కె.రెడ్డెప్ప నాయుడు, డి.ఏకాంబరం నాయుడు, పార్థసారథి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, కె.గణేష్ కుమార్, నాయకులు సర్దారు రమేష్ నాయక్, సురేష్ బాబు, నాగరాజు, జబరాజ్, సురేంద్ర బాబు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

తిరుపతి(అలిపిరి): టీటీడీలోని లడ్డూ కౌంటర్, రూమ్స్ అలాట్మెంట్ పర్సన్స్ నియామకం కోసం నోటిఫికేషన్ అంటూ ఇటీవల మీడియాలో అసత్య ప్రచారం జరుగుతోందని శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ సీఈఓ వైవీకే షణ్ముఖ్‌కుమార్ తెలిపారు. ఏదైనా ప్రకటన విడుదల చేసిన సమయంలో సంబంధిత వెబ్ సైట్ "rrmpc.in"లో ప్రచురిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగార్థులు అసత్య ప్రకటనలతో మోసాలకు గురికావద్దని సూచించారు.

క్లుప్తంగా

ఏఐకేఎంఎస్ నూతన కార్యవర్గం ఎంపిక


జిల్లా అధ్యక్షుడు ఉమాపతినాయుడు


ప్రధాన కార్యదర్శి వెంకటరమణారెడ్డి

బంగారుపాళెం: అఖిల భారత రైతు–కూలీ సంఘం ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నూతన కార్యవర్గాన్ని సోమవారం రాష్ట్ర అధ్యక్షుడి ప్రభాకర్ రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఉమాపతినాయుడు, ఉపాధ్యక్షులుగా రాజేంద్రనాయుడు, ఎండపల్లె వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణారెడ్డి, సహాయ కార్యదర్శిగా సుగుణ, సురేంద్రరెడ్డి, కోశాధికారిగా నారాయణ, కమిటీ సభ్యులుగా సదాశివం, చెన్నప్ప, గోపికృష్ణ, రవి, రామ్మూర్తి నాయుడు, శ్రీనివాసులు నాయుడు ఎన్నికయ్యారు.

చెట్టును ఢీకొట్టిన కంటైనర్


చెట్టును ఢీకొట్టిన కంటైనర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం అనంతాపురం వద్ద సోమవారం ఓ కంటైనర్ చెట్టును ఢీకొట్టడంతో ఆస్తినష్టం చోటు చేసుకుంది. తమిళనాడు చెన్నై నుంచి వస్తున్న చిత్తూరు వైపు వస్తున్న ఈ కంటైనర్ అనంతాపురం గ్రామానికి చెందిన పట్టాభి ఇంటి వద్ద అదుపుతప్పింది. అతివేగంతో వస్తున్న వాహనం ఇంటిని ఆనుకుని ఉన్న ఓ చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో చెట్టుకొమ్మలు విరిగి ఇంటిపై పడడంతో ఇళ్లు ధ్వంసమైంది. ద్విచక్రవాహనం కూడా నుజ్జునుజ్జయింది. పట్టాభి కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

నేటి నుంచి అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో మంగళవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అండర్–14 బాలికల అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఒలింపిక్ ఇండియన్ హాకీ ప్లేయర్ రజిని, వర్సిటీ వీసీ ఉమ ప్రారంభిస్తారని వెల్లడించారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి ఆల్ ఇండియా ఫుట్‌బాల్ పోటీలకు పంపుతామన్నారు.

జవాబుదారీతనంతో పరిష్కరించండి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 182 అర్జీలు
- జిల్లా నలుమూలల నుంచి వచ్చి వినతులు అందజేసిన ప్రజలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ


కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి సమస్యలను విన్నవిస్తున్న ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీలను ఆయా శాఖల అధికారులు జవాబుదారీతనంతో పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు ఉన్నతాధికారులకు వినతులను అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించి 182 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

182 అర్జీల స్వీకరణ..

రెవెన్యూ శాఖకు సంబంధించి 155, పోలీస్ శాఖ 5, జిల్లా విద్యాశాఖ 1, జిల్లా పంచాయతీ 1, దేవదాయ శాఖ 1, భూగర్భ గనుల శాఖ 1, ఎస్‌ఈ పంచాయతీ రాజ్ 1, డీఆర్‌డీఏ 2, డీసీహెచ్‌ఎస్ 2, డీఎంఅండ్‌హెచ్‌ఓ (వైద్య శాఖ)1, డీఎస్ఎల్‌ఓ 1, స్కిల్ డెవలప్‌మెంట్ 1, ఏపీఎస్ ఆర్టీసీ 1, డీఎఫ్‌ఓ 1, డ్వామా 2, సివిల్ సప్లై 2, మున్సిపల్ కమిషనర్ 1, హౌసింగ్ 1, ఎంపీడీఓ నగరి 1, సమగ్ర శిక్ష 1 అర్జీలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

శ్మశానానికి దారి కల్పించండి


కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చేందుకు విచ్చేసిన ఎల్లాపల్లి హరిజనవాడ గ్రామస్తులు

తమ గ్రామంలోని శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని గంగాధరనెల్లూరు మండలం ఎల్లాపల్లి హరిజనవాడ గ్రామస్తులు ఎల్లప్ప, శీనయ్య తదితరులు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని శ్మశానానికి దారి లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

విదేశీ విద్య పథకాన్ని అమలు చేయాలి

ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం విదేశీ విద్య పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలని కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం శీనప్పతోపు చేను గ్రామానికి చెందిన మునిరత్నం కోరారు. ఈ మేరకు ఆయన కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమది పేద వ్యవసాయ కుటుంబం అని, తన కుమారుడు వినోద్‌కుమార్ ఉజ్బెకిస్తాన్‌లో ఎంబీబీఎస్ కోర్సు చదివేందుకు మెడికల్ అకాడమీలో చేరాడని చెప్పారు. అప్పులు చేసి చదివిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విదేశీ విద్యాపథకం వల్ల తమకు న్యాయం జరుగుతుందని కలెక్టరేట్‌కు విచ్చేసినట్లు తెలిపారు. ఈ పథకం అమల్లో లేకపోవడంతో బ్యాంకులో రుణం అందించాలని కలెక్టర్ ఎల్‌డీఎంను ఆదేశించారు.

జీతాలు మంజూరు చేయండి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు గత 16 నెలలుగా రావాల్సిన జీతాలను వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, భారతి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు ఇవ్వకుంటే తాము ఎలా బతకాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ధర్నాలో నాయకులు గంగరాజు, హనుమంతు, నీలకంఠ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో భక్తుల రద్దీ


బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతుబలులు ఇచ్చి మొక్కులు చెల్లించారు. ఉపకమిషనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

జిల్లా రచయితల సంఘ నూతన కార్యవర్గం నియామకం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా రచయితల సంఘ నూతన కార్యవర్గాన్ని నియమించారు. చిత్తూరు నగరం రామలక్ష్మి నర్సింగ్‌లో సోమవారం రామలక్ష్మి అధ్యక్షతన సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా బాలకృష్ణారెడ్డి, అధ్యక్షుడు గిరిధరన్, ప్రధాన కార్యదర్శి సహదేవనాయుడు, కోశాధికారి గోవర్ధన్ బాబి, ఉపాధ్యక్షులుగా ఎడ్ల బాలకృష్ణారెడ్డి, అరుణకుమారి, శ్రీధర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రోజా ప్రియ, రమేష్ బాబు, గంటా మోహన్, శాంతా భాస్కర్, కృష్ణంరాజు, మునిరత్నంరెడ్డి నియమితులయ్యారు. కార్యక్రమంలో తెలుగుభాష అభిమానులు పాల్గొన్నారు.

ఆకాశంలో ప్రయాణం.. భూమిపై చోరీలు


గుడిపాలలో ఏటీఎంను పగులగొడుతున్న దొంగల ముఠా (ఫైల్)

చిత్తూరు అర్బన్: జిల్లాలోని గుడిపాల మండలంలో ఈనెల 6వ తేదీ అర్ధరాత్రి జరిగిన చోరీ ఘటనలో నిందితులను పట్టుకోవడానికి పోలీసు యంత్రాంగం సమీపించినట్లు తెలుస్తోంది. ఎస్‌బీఐ బ్యాంకుకు చెందిన రెండు ఏటీఎం యంత్రాలను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు, దాదాపు రూ.26 లక్షలు చోరీ చేశారు. ఈ ముఠాను పట్టుకోవడానికి ఇప్పటికే రంగంలోకి దిగిన చిత్తూరు పోలీసులు ఓ ప్రధాన నిందితుడి ఆచూకీ తెలుసుకున్నట్లు సమాచారం. హర్యానాకు చెందిన వాజీద్ అనే నిందితుడు ముఠా నాయకుడిగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఇతను విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి.. హర్యానాలో ఓ ముఠాను తయారు చేశాడు. ఈ ముఠా ఇప్పటికే బెంగళూరు, తమిళనాడు, ఉత్తరాది రాష్ట్రాల్లో పలు ఏటీఎంలు పగులగొట్టి అందులో ఉన్న నగదును చోరీ చేయడమే వృత్తిగా ఎంచుకున్నారు. వచ్చిన నగదులో ముఠా నాయకుడికి పెద్దమొత్తంలో అప్పగించి, మిగిలింది సభ్యులు పంచుకుంటారు. అయితే ముఠా నాయకుడు వాజీద్ గురించి పలు విషయాలు తెలుసుకున్న పోలీసులు నోరు వెళ్లబెడుతున్నారు. ఇతను నిత్యం విమానాల్లో బిజినెస్ క్లాస్ శ్రేణిలో ప్రయాణాలు చేస్తుంటాడని సమాచారం రాబట్టారు. దోపిడీ చేయాల్సిన ప్రాంతానికి కొద్ది దూరంలో మకాం వేస్తూ, దోచుకున్న నగదును తీసుకొచ్చిన వెంటనే పంపిణీ పూర్తి చేసి, ఆపై మళ్లీ విమానంలో వెళ్లిపోతాడని తెలిసింది. ఇతడిపై దక్షిణాది రాష్ట్రాల్లో పలు కేసులు ఉన్నట్లు, ఉత్తరాదిలో అరెస్టు వారెంట్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఇతడిని సమీపించిన పోలీసులు.. దోపిడీలో పాల్గొన్న వారి కోసం ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వారంలోపే గుడిపాల ఏటీఎం దోపిడీ గుట్టును పోలీసులు ఛేదించే అవకాశం ఉంది.

మామిడి బోర్డు ఏర్పాటు చేయాలి


బంగారుపాళెం: సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం(ఏఐకేఎంఎస్)రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం 'ప్రపంచ మామిడి దినోత్సవం'ను ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి వెంకయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మామిడి పంట అధికంగా పండుతుందని, బంగారుపాళెం మామిడి మార్కెట్ నుంచి పెద్దఎత్తున వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు మామిడి ఎగుమతులు సాగిస్తున్నారని చెప్పారు. రైతులు పండించిన మామిడికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. పంట వచ్చినప్పుడు ధర ఉండదని, ధర ఉన్నప్పుడు పంట రాక రైతులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, గిట్టుబాటు ధరకు ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మామిడి బోర్డు ఏర్పాటు కోసం రైతులు సంఘటితంగా పోరాటం చేయాలని, ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నాయకులు పద్మనాభ నాయుడు, ఆనందనాయుడు, వెంకటరత్నం, ఉమాపతినాయుడు, రాజేంద్రనాయుడు మాట్లాడుతూ సాగు, తాగునీటి కోసం హంద్రీనీవా కాలువలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుగుణ, సురేంద్రనాథ్, సుదర్శన్‌నాయుడు, మనోజ్‌కుమార్‌రెడ్డి, సదాశివం, వెంకటరమణ, నారాయణ, మామిడి రైతులు పాల్గొన్నారు.

కూటమి నేతలకు ఉపాధి మేత

- అధికారంలోకి రాగానే అక్రమ సంపాదనకు తెరలేపిన తమ్ముళ్లు
- పేదల పొట్ట కొడుతున్న వైనం
- ఉపాధిహామీ పనులను కూలీలతో కాకుండా యంత్రాలతో చేయించి ప్రజాధనం దోపిడీ
- గ్రామాల్లో పనులు లేక వలసలు వెళ్తున్న ప్రజలు


పాత గుంతలకే మెరుగులు చేసి బిల్లులు స్వాహా చేసుకున్న కూటమి నేతలు

బైరెడ్డిపల్లె: గ్రామాల్లో వలసల నివారణ కోసం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్షేత్రస్థాయిలో అధికారులు యంత్రాలతో పనులు చేయిస్తూ, పేదల పొట్ట కొడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కూటమి నేతలు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. అధికారులు సైతం కూటమి నేతల చేతుల్లో కీలుబొమ్మలుగా మారి, వారు చెప్పినట్టే చేస్తుండడంతో స్థానిక ప్రజలు పనులు లేక వలసలు వెళ్తున్నారు. తాజాగా మండలంలోని కడపనత్తం పెద్దచెరువులో రెండు రోజుల కిందట ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలతో పనులు చేయడానికి కొలతలు తీశారు. ఈ పనులు పూర్తయితే రూ.4,91,564 వేలు కూలీలకు చెల్లించేందుకు రికార్డుల్లో నమోదు చేశారు. అయితే రాత్రివేళ జేసీబీతో మట్టిని తీసి ట్రాక్టర్‌లో వేసి ఎవరికీ అనుమానం రాకుండా గుంత చుట్టూ మట్టిని వేశారు. ఈనెల 22న సోమవారం 112 మంది కూలీలతో పనులు చేసినట్లు మస్టర్లలో నమోదు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పశువులు, గొర్రెల కాపర్లు ప్రతి దినం చెరువులోనే ఉంటామని, సోమవారం ఇక్కడ ఎలాంటి పనులు చేయలేదని తెలిపారు. కూలీలు లేకుండానే ఇంతమట్టి ఎప్పుడు తీశారని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతంలో పనిచేసిన ఫీల్డ్‌అసిస్టెంట్లను ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న కూలీలకు పనులు కల్పించాలని పలువురు కోరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ధనార్జనే ధ్యేయంగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వలసలను నివారించి, కూలీలకు పనులు కల్పించాలని కోరుతున్నారు.

అమ్మవారి ఆలయ మాన్యం భూమి హాంఫట్

- కౌలుకు తీసుకున్న భూమినే కాజేసిన ఓ ఘనుడు
- తప్పుడు పత్రాలతో తన పేరిట మార్చుకున్న వైనం
- పలమనేరు తహసీల్దార్‌కు కునుమానుగుట్ట గ్రామస్తుల ఫిర్యాదు


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పలమనేరు: గ్రామదేవత మారెమ్మ ఆలయ మాన్యం భూమిని కౌలుకు ఇస్తే.. తప్పుడు పత్రాలతో సదరు వ్యక్తి ఆ భూమిని తన పేరిట మార్చుకుని అమ్మవారికే శఠగోపం పెట్టిన ఘటన పలమనేరులో వెలుగుచూసింది. దీనిపై మండలంలోని మండిపేట కునుమానుగుట్ట గ్రామస్తులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని మారెమ్మ ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 348లో 1.94 ఎకరాల దేవుని మాన్యం భూమి ఉందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం అని ఆ భూమిని తమ గ్రామానికే చెందిన తోటి అశోక్‌కు కౌలు ఇచ్చామని, అప్పటి నుంచి అతను సాగు చేసుకుంటున్నాడని తెలిపారు. అయితే అతను రహస్యంగా ఆ భూమిని తప్పుడు రికార్డులతో తన పేరిట రాయించుకుని అమ్మవారినే మోసం చేశాడని ఆరోపించారు. వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ రంగనాయకులు స్పందిస్తూ విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామప్ప, సుబ్రమణ్యం, రవి, మురగేష్, గోవిందస్వామి తదితరులు ఉన్నారు.

ట్రయింఫ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం


కొత్త ట్రయింఫ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీటీవో జి.ఆదినారాయణ, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులో ఏర్పాటుచేసిన ట్రయింఫ్ తిరుపతి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీటీవో జి.ఆదినారాయణ మాట్లాడుతూ ఔత్సాహిక రైడర్లు, బలమైన బైకింగ్ సంస్కృతిని, బలమైన కమ్యూనిటీని పెంపొందించడానికి ట్రయింఫ్ బ్రాండ్ సరైన ఎంపికగా నిలుస్తుందన్నారు. ప్రోబైకింగ్ సర్కిల్ హెడ్ గౌతమ్ మోదీ, రీజనల్ మేనేజర్(సర్వీస్) సౌత్–1 నీరజ్‌తివారి, ఏరియా సేల్స్ మేనేజర్ రాజీవ్ కన్నన్, ఏరియా సర్వీస్ మేనేజర్ ప్రభు, గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్ ప్రసంగించారు. కొత్త ట్రయింఫ్ యజమానులు తమ బైక్‌లను ఒరిజినల్ ట్రయింఫ్ ఎక్సెసరీస్‌తో తమకు కావాల్సిన రీతిలో మార్చుకోవచ్చన్నారు. స్టీరింగ్ సౌకర్యం నుంచి సామాను, భద్రత వరకు బైక్‌ను విస్తృత శ్రేణి రైడర్‌ల అవసరాలకు అనుగుణంగా చేసుకోవచ్చన్నారు. కొత్త కస్టమర్లు 16,000కి.మీ. సర్వీస్ సేవలు, రెండేళ్ల పరిమిత మైలేజ్ వారంటీ, మరో మూడేళ్లు పొడిగించిన వారంటీని పొందవచ్చన్నారు. సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్రవిడ వర్సిటీలో యూజీ కోర్సుల్లో ప్రవేశ గడువు పొడిగింపు


రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్

గుడుపల్లె: ద్రవిడ వర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి ఈ నెల 25 వరకు గడువు పొడిగించినట్లు రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ తెలిపారు. బీఏ ఆనర్స్, హిస్టరీ, బీకాం ఆనర్స్, కంప్యూటర్ అప్లికేషన్, జనరల్ బీబీఏ, బీఎస్సీ ఆనర్స్, మ్యాథమ్యాటిక్స్ బీఎస్సీ ఆనర్స్, బయోటెక్నాలజీ కోర్సులు ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ ప్రక్రియ ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు ఓఏ ఎండీసీ–2024 పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుందని వివరించారు.

జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక


సాఫ్ట్‌బాల్ ఆడుతున్న బాలికలు

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం జిల్లాస్థాయిలో సాఫ్ట్‌బాల్ సీనియర్, జూనియర్ బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్, కార్యదర్శి రమేష్ తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లాలో సాఫ్ట్‌బాల్ గేమ్ అనతికాలంలోనే మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు సీనియర్ బాల, బాలికల విభాగంలో 32 మంది, జూనియర్ బాల, బాలికల విభాగంలో 32 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు వివరించారు. జిల్లాస్థాయి పోటీల్లో సీనియర్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 10, 11, 12 తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండలో రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొంటారన్నారు. అదేవిధంగా జూనియర్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ దేవానంద్, గుడిపాల పీడీ గురుప్రసాద్, నారాయణవనం పీడీ జయప్రకాష్, సీనియర్ క్రీడాకారులు లోకేష్, సాయి, శశి పాల్గొన్నారు.


సాఫ్ట్‌బాల్ సీనియర్ విభాగంలో ఎంపికైన బాల, బాలికలు


జూనియర్ విభాగంలో ఎంపికైన బాల, బాలికలు